సాక్షి
కుమురం భీం

మంగళవారం । 1 । జూలై । 2025



మేమున్నామని..
వైద్యుడు దేవుడితో సమానమని అంటుంటారు. దేవుడు జన్మనిస్తే.. డాక్టర్ పునర్జన్మనిస్తాడు. మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కథనం.
8లో▸



ప్రమాదకర ప్రయాణం
తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి లింగాపూర్ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం అధికలోడ్‌తో ఇసుక తరలిస్తుండటంతో కంకర తేలింది.
9లో▸

గరిష్టం/కనిష్టం
29.4 /25.6

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి గంగాపూర్ రైల్వేగేట్ మూసివేత

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వేగేట్‌ను మంగళవారం నుంచి మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లెవల్ క్రాసింగ్ వద్ద ట్రాక్ మరమ్మతుల కారణంగా గేట్ మూసివేయనున్నట్లు ప్రకటించారు. ట్రాక్‌కు అవతలి వైపు ఉన్న గ్రామాల ప్రజలు రెబ్బెనకు వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని వారు సూచించారు.

విద్యుత్ కోతలపై రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని బురదగూడ, వంజిరి, సీఆర్‌నగర్, అంకుసాపూర్, నార్లపూర్ గ్రామాలకు మూడు నెలలుగా విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నారని సోమవారం పట్టణంలోని ఎన్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నాకు దిగారు. వర్షాకాలంలో విషపురుగులు తిరిగే అవకాశం ఉందని, కరెంట్ లేకపోవడంతో చీకట్లో ప్రమాదాలకు ఆస్కారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ, లైన్‌మెన్లకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకుని, సమస్య పరిష్కరించని పక్షంలో మళ్లీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగూరె శ్యాంరావు, కొట్రంగే నాందేవ్, గొత్రే గోపాల్, మురళీ, తిరుపతి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కాగజ్‌నగర్‌రూరల్: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఎస్‌ఈ శేషాగిరి రావు అన్నారు. పట్టణంలోని డివిజన్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. సమస్యలు ఎదురైతే టోల్‌ఫ్రీ నం.1912కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం బురదగూడ, వంజిరి, సీఆర్‌నగర్, అంకుసాపూర్, నార్లపూర్ గ్రామాల రైతులు ఆయనకు వినతిపత్రం అందించారు.

అతిథి అధ్యాపకులను సర్దుబాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న అతిథి అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: అతిథి అధ్యాపకులను తిరిగి జిల్లాలోనే సర్దుబాటు చేయాలని పలువురు గెస్ట్ లెక్చరర్లు సోమవారం జిల్లా కేంద్రంలో డీఐఈవో కళ్యాణికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతేడాది రెగ్యులర్ అధ్యాపకులు రావడంతో 41 మంది అతిథి అధ్యాపకులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. సీనియార్టీ ప్రకారం ప్రాధాన్యత ఇస్తూ కళాశాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు శ్రీని వాస్, మారుతి, రాజన్న, మహేశ్, సరళ, సుశీల్, సునీత తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కండక్టర్‌కు పరామర్శ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ మనోజ్‌ను సోమవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, ఏఐటీయూసీ నాయకులు పరామర్శించారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి దివాకర్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు మోహన్, బాబు, సమ్మయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జూన్.. సాధారణం



దహెగాం పెద్దచెరువు కింద బీడుగా పొలాలు

- ఏడు మండలాల్లో అధికం.. మూడు మండలాల్లో లోటు వర్షపాతం
- ఇప్పటికీ భారీ వర్షాల జాడే లేదు..
- చెరువులు, ప్రాజెక్టులోకి చేరని వరద
- నెమ్మదిగా వరిసాగు

దహెగాం(సిర్పూర్): వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికీ భారీ వర్షాలు కురవలేదు. అడపాదడపా కురుస్తున్న వానలతో జూన్‌లో సాధారణ సగటు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభానికి కంటే ముందుగానే వర్షాలు పలకరించాయి. దీంతో జిల్లాలోని రైతులు మృగశిర కార్తెలోనే పత్తి విత్తనాలు విత్తడం ప్రారంభించారు. ఆ సమయంలో వారం రోజులపాటు వరుణుడి జాడ లేకపోవడంతో కొంతవరకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ తర్వాత చినుకులకు మొలకలు వచ్చాయి. మొలకెత్తని చేలలో కొందరు మళ్లీ కూలీలతో విత్తనాలు వేసుకున్నారు.

214.1 సగటు వర్షపాతం

జిల్లావ్యాప్తంగా జూన్‌లో 188.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. నెలాఖరు నాటికి 214.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, సుమారు 15 రోజుల్లో వర్షం పడిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జైనూర్, సిర్పూర్(యూ), చింతలమానెపల్లి మండలాల్లో మాత్రం లోటు కనిపిస్తోంది. మరోవైపు ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, లింగాపూర్, రెబ్బెన, ఆసిఫాబాద్, కెరమెరి, సిర్పూర్(టి)లో అధిక వర్షపాతం, వాంకిడి, కాగజ్‌నగర్ మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది.

వరిసాగు అంతంతే..

భారీ వర్షాలు లేక ప్రాజెక్టులు, చెరువుల్లో వరద నీరు చేరలేదు. దీంతో వరిసాగు పనులు ముందుకు సాగడం లేదు. ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాలతోపాటు సిర్పూర్ నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉంటుంది. ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకోవాల్సి ఉండగా.. ఆ దిశగా పనులు సాగడం లేదు. భారీ వర్షాలు లేక ప్రధాన ప్రాజెక్టులు, చెరువుల ఆయకట్టు కింద రైతులు పనులు ప్రారంభించలేదు. పొలాలు బీళ్లుగా ఉన్నాయి. బోర్లు, బావుల నీటి సౌకర్యం ఉన్న వారు మాత్రం నారుమడులు సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో మొలక అలుకుతున్నారు.

మొలక దశకు పత్తి..

వానాకాలం సీజన్ ప్రారంభ సమయంలో వర్షాలు ముఖం చాటేసినా.. ఆ తర్వాత పడిన వానతో జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగాయి. జిల్లాలో 4.45 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా.. అందులో ప్రధానంగా 3.45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం పత్తి విత్తుకోవడం పూర్తయింది. పత్తి విత్తనాలు కూడా మొలకెత్తాయి. కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతం ఉండటంతో విత్తనాలు మొలకెత్తకపోవడంతో మరోసారి వేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం పడుతున్న ముసురు వానలు పత్తి, సోయా వంటి పంటలకు మేలు చేస్తాయని రైతులు ఆశాభావం చేస్తున్నారు.

జూన్ వర్షపాతం వివరాలు(మి.మీ.లలో)

మండలం	కురువాల్సింది	కురిసింది	స్థితి
జైనూర్	210.1	128.2	-39 లోటు
సిర్పూర్(యు)	193.4	162.7	-16 సాధారణం
లింగాపూర్	187.7	259.9	39 అధికం
తిర్యాణి	167.1	133.4	-20 లోటు
రెబ్బెన	151.1	217.9	44 అధికం
ఆసిఫాబాద్	173.4	251	45 అధికం
కెరమెరి	168.3	225	34 అధికం
వాంకిడి	198.1	342.7	73 అత్యధికం
కాగజ్‌నగర్	169.6	294.8	74 అత్యధికం
సిర్పూర్(టి)	190.1	248.8	31 అధికం
కౌటాల	201	228.1	13 సాధారణం
చింతలమానెపల్లి	205.9	164.9	-20 లోటు
బెజ్జూర్	216.5	198.4	-8 సాధారణం
పెంచికల్‌పేట్	192.4	167.8	-13 సాధారణం
దహెగాం	204.4	186.4	-9 సాధారణం

పత్తికి అనుకూలం



ఈ వానాకాలం సీజన్‌లో ఐదెకరాల్లో పత్తి సాగు చేసిన. ప్రస్తుతం మొక్క నాలుగు ఆకుల దశలో ఉంది. వర్షాలు పత్తి పంటకు అనుకూలంగా ఉన్నాయి. మొదట్లో వానలకు పత్తి మొలకెత్తని చోట మరోసారి విత్తనాలు పెట్టినం. అవి కూడా ఇప్పుడు మొలకెత్తాయి. దౌర కొట్టే సమయం వచ్చింది.

– నికాడి నారాయణ, రైతు, దహెగాం

15 వరకు పత్తి విత్తుకోవచ్చు



ఇప్పటికే జిల్లాలో 98 శాతం పత్తి విత్తుకోవడం పూర్తయింది. జూలై 15 వరకు కూడా విత్తుకోవచ్చు. ఆగస్టు మొదటి వారం లోగా వరి నాట్లు పూర్తి చేసుకోవాలి. ఖర్చు తగ్గడానికి వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకుంటే మంచిది. 10 కిలోల వరి విత్తనాలు ఎకరానికి వేసుకోవచ్చు. డ్రమ్ సీడర్‌తో వేసుకుంటే పంట త్వరగా చేతికొస్తుంది.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

ప్రవేశాలు, ఫలితాలపై దృష్టి

- డీఐఈవో కళ్యాణి



డీఐఈవో కళ్యాణి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచడం, మెరుగైన ఫలితాలు సాధించడంపై దృష్టి సారించామని జిల్లా మాధ్యమిక విద్యాధికారి(డీఐఈవో) కళ్యాణి అన్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని, గతేడాది ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇటీవల పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు వచ్చిన నేపథ్యంలో అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నామని, ప్రవేశాల పెంపు కోసం ఇంటింటి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. 2025– 26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కళాశాలల్లో వసతులు, ప్రవేశాల వివరాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల తీరు ఎలా ఉంది. ఇప్పటివరకు ఎన్ని అడ్మిషన్లు వచ్చాయి?

డీఐఈవో: జిల్లాలో జూనియర్ కళాశాలలు 48 ఉండగా, ఇందులో ప్రభుత్వ కాలేజీలు 11, ప్రైవేట్ 4, కేజీబీవీలు 13, బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకుల కళాశాల మరో 20 వరకు ఉన్నాయి. 11 ప్రభుత్వ కళాశాలల్లో గతేడాది 2,535 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మూడు వేల సంఖ్యను చేరుకోవడమే లక్ష్యంగా అధ్యాపకులతో ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. ఫస్టియర్‌లో 1,198 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ప్రవేశాల సంఖ్య మరింత పెరుగుతుంది.

సాక్షి: గత విద్యా సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించిన కళాశాలల్లోనూ ప్రవేశాల సంఖ్య తగ్గింది. దీనికి కారణాలేంటి?

డీఐఈవో: గతేడాది చాలా వరకు ప్రభుత్వ కాలేజీ మెరుగైన ఫలితాలు సాధించాయి. అయితే ప్రభుత్వ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో విద్యార్థులు ఎక్కువ మంది అక్కడే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈ కారణంతోనే గవర్నమెంట్ కాలేజీల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి.

సాక్షి: 2025– 26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి ప్రణాళికలు అమలు చేయనున్నారు?

డీఐఈవో: గతేడాది ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండోస్థానంలో నిలవగా, ఫస్టియర్ ఫలితాల్లో నాలుగోస్థానంలో నిలిచింది. 2025– 26 విద్యా సంవత్సరంలో కూడా ఫలితాలు తగ్గకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తాం. సకాలంలో సిలబస్ పూర్తి చేయడంపై దృష్టి సారిస్తాం. అధ్యాపకుల కొరత ఉన్న ఉర్దూ మీడియం కళాశాలల్లో ఒప్పంద పద్ధతిన లెక్చరర్లను నియమిస్తాం.

సాక్షి: ప్రభుత్వ కళాశాలల్లో వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఐఈవో: కొన్ని కళాశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. రెబ్బెన కళాశాలలో 18 గదులకు 9 గదులు మాత్రమే ఉన్నాయి. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఒకేచోట బోధిస్తున్నారు. ప్రహరీలు నిర్మాణం, మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ ఏడాది అధ్యాపకుల కొరత లేదు. కళాశాలలకు తాజాగా ప్రభుత్వం రూ.10వేలు చొప్పున జమ చేసింది. మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.

కళాశాలల్లో వసతుల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం డీఐఈవో కళ్యాణితో కలిసి ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ఫర్నీచర్‌తోపాటు ఇతర మరమ్మతుల కోసం జాబితా సిద్ధం చేయాలని సూచించారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి



పీహెచ్‌సీలోని రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): వైద్యసిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం డీఎంహెచ్‌వో సీతారాంతో కలిసి సందర్శించారు. ఆస్పత్రి వార్డులు, ల్యాబ్‌తోపాటు పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి పనులను పీడీ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రో ఫర్టిలైజర్ షాపు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, విద్యాబోధన అంశాల గురించి తెలుసుకున్నారు. వంటకు నాణ్యమైన సరుకులు వినియోగించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సూర్యప్రకాష్, ఏవో దిలీప్‌కుమార్, ప్రిన్సిపాల్ రజనీ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



కాగజ్‌నగర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్‌టౌన్: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు మండలంలోని చింతగూడ, బలగల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, గన్నారం జెడ్పీఎస్‌ఎస్‌లో సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తప్పుదోవ పడుతున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలకు బారిన పడకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాకారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల గురించి తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908 లేదా 87126 70551 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రవిచంద్ర, టౌన్ సీఐ ప్రేంకుమార్, ఎస్సైలు సుధాకర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చి.. వినతులిచ్చి

- ప్రజావాణికి క్యూ కట్టిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చి వినతులు సమర్పించారు. బాధితుల సమస్యలు విన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని రెబ్బెన మండలం పర్లనంబాలకు చెందిన ఆదే మాధవ్ దరఖాస్తు చేసుకున్నాడు. తాను సాగు చేసుకుంటున్న భూమిని వేరే వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ కాలనీకి చెందిన గౌరోజు శోభ కలెక్టర్‌ను కోరింది. ఆసిఫాబాద్ మండలం సామెల శివారులోని తన పట్టా భూమికి కొత్త పట్టా పాస్ పుస్తకం జారీ చేయాలని జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌కు చెందిన సోమ శంకర్ విన్నవించాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్రంలోని బజార్‌వాడికి చెందిన కాంబ్లె నీలాబాయి దరఖాస్తు చేసుకుంది. తన కుమారుడికి గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు ఇప్పించాలని కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన గోలేటి శ్రీనివాస్ కోరాడు. తన పేరుతో ఉన్న పట్టా భూమికి కొత్త పట్టా పాస్‌బుక్ జారీ చేయాలని కౌటాల మండలం కనికి గ్రామానికి చెందిన బర్ల శంకరక్క అర్జీ సమర్పించింది. బీఎస్సీ, బీఈడీ చదివిన తనకు అర్హత గల ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని జైనూర్ మండలం కొండిబగూడకు చెందిన సోన్ కాంబ్లే దరఖాస్తు చేసుకుంది. తన భర్త అనారోగ్యంతో ఉన్నాడని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తనకు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉపాధి కల్పించాలని కెరమెరి మండలం గౌరి గ్రామానికి చెందిన తాగ్రే కవిత వేడుకుంది. వాంకిడి మండలం సరండి గ్రామ శివారులోని తమ పట్టా భూమిలో 2 గుంటలు ఫోర్‌లైన్‌లో పోగా.. రికార్డులో తప్పుగా నమోదు చేశారని, వివరాలు సరిచేయాలని జిల్లా కేంద్రానికి చెందిన ఎకిరాల సంతోష్, గణపతి కోరారు. కెరమెరి మండలం దేవుడిపల్లి గ్రామ శివారులోని సర్వే నం.7లోని ఐదెకరాల పట్టా భూమిని నలుగురు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారని, తనకు న్యాయం చేయాలని తక్సండే శేఖర్ వేడుకున్నాడు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు దారిలేదు



'బూర్గుడ శివారులోని సర్వే నం.15, 14తో పాటు పలు సర్వే నంబర్లలో పంట పొలాలకు వెళ్లేందుకు గతంలో ఉన్న దారిని ఇద్దరు వ్యక్తులు మూసివేశారు. వెనుకవైపు ఉన్న పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. సుమారు 200 ఎకరాలకు దారి లేదు. విచారణ చేపట్టి రహదారి సౌకర్యం కల్పించాలి..' అని బూర్గుడ గ్రామానికి చెందిన రైతులు గెడెకర్ గణేశ్, సత్తె లింగు, శెండె విఠు, గణపతి తదితరులు కోరారు.

పింఛన్ వస్తలేదు



నా భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– చాకటి పోషక్క, బూర్గుడ

రైతు భరోసా ఇప్పించాలి



నేను ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదరాలిని. సిర్పూర్– యూ మండలం పంగిడిలో మాకు ప్రభుత్వం అటవీహక్కు పత్రం కింద ఐదెకరాల పోడు భూమికి పట్టా ఇచ్చింది. భూమి సాగు చేసుకుంటున్న నాకు రైతు భరోసాతోపాటు బ్యాంకు రుణం ఇప్పించాలి.

– దుర్వ జలుతాబాయి, సిర్పూర్– యూ

ఆన్‌లైన్‌లో వివరాలు లేవు



ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. గత ఆరు నెలలుగా సెర్ప్, మెప్మా వెబ్‌సైట్‌లో కూడా సమాచారం లేదు. బ్యాంకు రుణాలు అందించలేదని పరిస్థితి ఉంది. గత ఆరు నెలలుగా మాకు వేతనాలు రావడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహిళా రిసోర్స్‌పర్సన్లు, ఆసిఫాబాద్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, పక్కన సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్(రెవెన్యూ), కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సోమవారం తనిఖీలు నిర్వహించారు. యూరియా అక్రమ అమ్మకాలపై 'సాక్షి'లో సోమవారం 'యూరియా దందా' అనే కథనం ప్రచురితం కావడంతో దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. రైతు ఆగ్రోస్ కేంద్రంలోని యూరియా విక్రయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విక్రయానికి సంబంధించిన రశీదులు ఉండాలని సూచించారు. అనంతరం గోదాముల్లో ఎరువుల నిల్వ పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, తహసీల్దార్ పుష్పలత, ఏవో మనీషా, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైలులోంచి కిందపడిన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బోదన్‌పల్లికి చెందిన ఐటీఐ విద్యార్థి చింతపూడి కార్తీక్ (17) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు కార్తీక్ తన తల్లి భీమక్కతో కలిసి కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మందమర్రి రైల్వేస్టేషన్ వద్ద కాలుజారి కిందపడ్డాడు. గాయాలు కావడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమక్క ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

'ఇసుక అక్రమ రవాణాకు తావులేదు'

కోటపల్లి: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని ఎర్రాయిపేట ఇసుక క్వారీలో ఎలాంటి అక్రమ రవాణా జరగడంలేదని మైనింగ్ ఏడీ జగన్మోహన్ రెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పార్‌పల్లి జాతీయ రహదారిపై టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీ చెక్‌పోస్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఇసుక క్వారీల్లో 24గంటలు మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల తనిఖీలతో పకడ్బందీగా ఇసుక తరలిస్తున్నామని, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో లారీల్లో ఇసుక లోడ్ జరుగుతుందని, అక్రమ రవాణా జరుగుతుందని వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. ఇసుక లోడింగ్ నిలిచిపోవడంతో లారీలు పెద్దఎత్తున ఆగాయని, వాటిని కూడా పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దేవేందర్‌రావు, ఎస్సై రాజేందర్, తహసీల్దార్ రాఘవేందర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని..

నిర్మల్‌ఖిల్లా/గేట్: వైద్యో నారాయణో హరి అంటారు.. వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. దేవుడు జన్మనిస్తే.. డాక్టర్ పునర్జన్మనిస్తాడు. కనిపించే దేవుడు.. రోగికి ప్రాణం పోసే ప్రాణదాత డాక్టర్. నాడి పట్టి.. గుండె గుబులును దూరం చేసేది వైద్యుడే. ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బిధాన్ చంద్రరాయ్ పుట్టిన రోజున జాతీయ డాక్టర్స్ డే జరుపుకుంటున్నారు. 1882 జూలై 1న జన్మించిన రాయ్ కలకత్తా మెడికల్ కళాశాలలో వైద్యడిగ్రీ పొందారు. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్యసేవలు ప్రారంభించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్యవృత్తిలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1961లో భారత రత్న అవార్డుతో సత్కరించింది. 1962 జూలై1న కన్నుమూశారు. బిధాన్ చంద్ర రాయ్ జయంతిని డాక్టర్స్‌డేగా జరుపుకోవాలని 1961లో ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వృత్తినే దైవంగా భావిస్తూ.. రోగులకు స్వస్థత చేకూరుస్తూ... మేమున్నామని ధైర్యం చెబుతున్న వైద్యులపై ప్రత్యేక కథనం..



- ప్రాణదాతలుగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ
- రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు
- వృత్తికే వన్నె తెస్తున్న ఆపద్బాంధవులు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

25 ఏళ్ల అనుభవం..



1995లో గాంధీ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, 1998లో ఎండీ, పిడియాట్రీషన్ పూర్తిచేశా. మూడేళ్లపాటు నిజామాబాద్‌లో పిల్లల వైద్యునిగా పనిచేశా. 2012లో నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైనప్పటి నుంచి వివిధ హోదాలలో సేవలు అందించా. గతేడాది నుంచి నిర్మల్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టా. ఈ 25 ఏళ్ల అనుభవంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా.

– డాక్టర్ గోపాల్‌సింగ్, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆసుపత్రి, నిర్మల్

వైద్యసేవలు అందించాలనే..



పేదలకు వైద్యసేవలు అందించాలనే వైద్యవృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నా. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే వసతులు, వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా. వైద్యవృత్తి సేవా దృక్పథంతో ముడిపడి ఉంటుంది. డబ్బుల కోసమే కాకుండా స్వచ్ఛందంగా వైద్య సేవ లందించాలి.

– డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, భైంసా ఏరియా ఆసుపత్రి

జీవితం పేదల కోసమే..



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నా. పేదలకు సేవ చేయడానికి జీవితాన్ని అంకితం చేశా. నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నా. నిత్యం 300 నుంచి 400 మంది ఆయా సేవల నిమిత్తం వస్తుంటారు. చివరి పేషెంట్ వరకు ఏరోజుకు ఆరోజు స్కానింగ్ చేయడంతో పాటు రిపోర్టులు తయారు చేసి రోగులు ఇబ్బందులు పడకుండా చూస్తాం. సేవలకు గుర్తింపుగా కలెక్టర్, మంత్రుల చేతుల మీదుగా పలుమార్లు అవార్డులు అందుకున్నా.

– నూతుల కళ్యాణ్‌రెడ్డి, ప్రొఫెసర్, రిమ్స్

ప్రజలకు సేవ చేయాలని..



ఆదిలాబాద్‌టౌన్: వరంగల్‌లోని కేఎంసీలో వైద్య విద్య అభ్యసించా. ఢిల్లీలో పీజీ పూర్తి చేశా. అక్కడే అంబేడ్కర్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించా. జిల్లా ప్రజలకు వైద్యసేవలు అందించాలని తండ్రి శ్రీరాములు కోరిక మేరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యునిగా చేరారు. నాలుగేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నా. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా.

– డాక్టర్ ఆడె విఠల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్

నమ్మకమైన సేవలు అందించాలి



అమ్మానాన్నల ప్రోత్సాహంతో వైద్య కోర్సు పూర్తిచేశా. వైద్యోనారాయణోహరి అనే నానుడిని నేడు కార్పొరేట్ ఆస్పత్రులు పూర్తిగా డబ్బులకు ఆశపడి మరిచిపోతున్నాయి. వైద్యులు రోగులకు నమ్మకమైన సేవలందించాలి. వైద్యరంగంలో రాణించాలనుకునే యువత ముందుగా ఎథికల్ ప్రాక్టీస్ చేయాలి. వైద్యులు ముఖ్యంగా మాతాశిశు మరణాలు జరగకుండా ఆపగలిగితే మనదేశం అభివృద్ధిలో మరింత ముందుంటుంది.

– డాక్టర్ ప్రత్యూష, లక్ష్మణచాంద పీహెచ్‌సీ

వృత్తిలో తృప్తి



రోగులకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా విధులు నిర్వహిస్తున్నా. వైద్య వృత్తిలో తృప్తి లభిస్తోంది.

– శివకుమార్, కడెం పీహెచ్‌సీ

బీసీరాయ్ ఆదర్శం..



వైద్యవృత్తి ఎంతో గౌరవప్రదమైనది. ప్రతీ ఉద్యోగికీ ఉద్యోగ విరమణ ఉంటుంది. కానీ వైద్యుడికి మాత్రం ఉండదు. తాను చనిపోయేంత వరకు వైద్యం అందిస్తూనే ఉంటారు. ప్రతీ వైద్యుడు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి. డాక్టర్ బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు వైద్యసేవలు అందిస్తున్నా.

– డాక్టర్ అశ్వీర్‌రెడ్డి, మత్తు వైద్యనిపుణులు, నర్సాపూర్(జి) సీహెచ్‌సీ

18 ఏళ్లుగా సేవలు..



చెన్నూర్: పద్దెనిమిదేళ్లుగా చెన్నూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్నా. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నా. రోగులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇప్పటి వరకు పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నా. రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తా.

– సత్యనారాయణ, చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

సమాజ సేవలో చంద్రదత్



మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన వైద్యుడు జీవీఎంఎస్ చంద్రదత్ ఐబీ సమీపంలో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. తరచూ ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు సైతం అందిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగుల ఆర్థిక పరిస్థితినిబట్టి ఫీజులు తీసుకుంటున్నారు. అనవసరమైన టెస్టులు చేయకపోవడం, అవసరానికి మించి మందులు రాయడం వంటివి లేకపోవడంతో ప్రజలు నమ్మకంగా వస్తున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధాశ్రమంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు. ఆశ్రమాలకు అవసరమైన సరుకులు, నగదు అందజేస్తున్నారు.

– డాక్టర్ చంద్రదత్, జనరల్ మెడిసిన్

యువకుడి హత్య



శ్రీధర్‌చారి (ఫైల్)

పెంచికల్‌పేట్:పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి గ్రామానికి చెందిన దీకొండ శ్రీధర్‌చారి(25) సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. ఎస్సై కొమురయ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగించే శ్రీధర్‌చారి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన పొట్టి రాజన్న ఇంటి వెనుక పెరట్లో దారుణ హత్యకు గురయ్యాడు. మారణాయుధంతో నరికి చంపినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో శ్రీధర్‌చారిని తానే హత్యచేశానని పొట్టి రాజన్న పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సఫారీకి సెలవు

- జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేత
- అక్టోబర్ నుంచి పునఃప్రారంభం

జన్నారం: కవ్వాల్ అభయారణ్యంలోని జన్నారం అటవీ డివిజన్‌లో జంగల్ సఫారీకి అటవీశాఖ మూడు నెలలపాటు సెలవు ప్రకటించింది. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చదనం పంచుతున్న అడవి అందాలను తిలకించేందుకు పర్యాటక శాఖ జన్నారంలో హరిత రిసార్ట్‌లు ఏర్పాటు చేయగా పర్యాటకశాఖ రెండు సఫారీలు, అటవీశాఖ ఐదు సఫారీలు ఏర్పాటు చేశారు. జన్నారం వచ్చిన పర్యాటకులు సఫారీ ద్వారా దట్టమైన అడవిలోనికి వెళ్లి పచ్చని చెట్ల నడుమ పర్యటించడం వల్ల ఆహ్లాదం పొందుతున్నారు. అడవుల అందాలను, వన్యప్రాణుల పరుగులను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.



సఫారీ వాహనం

మూడు నెలలపాటు నిలిపివేత

అడవుల అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మూడు నెలల పాటు సఫారీ ప్రయాణానికి అనుమతి లేదు. ఎందుకంటే వర్షాకాలంలో వన్యప్రాణులు ఎదకు వచ్చి బయట విచ్చలవిడిగా తిరుగుతాయి. సఫారీ ప్రయాణంతో వాటికి ఆటంకం కలుగుతుంది. వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించవద్దనే ఉద్దేశంతో మూడు నెలలు (జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు పర్యాటకశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

మూణ్నెళ్లు బంద్‌చేస్తాం

ఎన్‌టీసీఏ సూచనల ప్రకారం ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మూడు నెలలపాటు సఫారీ ప్రయాణం బంద్ చేయడం జరుగుతోంది. వర్షాల కారణంగా అడవిలో బురదలో వాహనాలు కూరుకుపోయి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అక్టోబర్‌లో తిరిగి అనుమతులు ఇస్తాం. పర్యాటకులు గమనించాలి.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

ఆర్జీయూకేటీలో అకడమిక్ రివ్యూ మీటింగ్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో 2025–26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అకాడమిక్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, ఓఎస్‌డి ప్రొఫెసర్ ఈ. మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, రిజిస్టర్ల నిర్వహణ, డేటా భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌ఏఏసీ ఫైల్ తయారీపై అన్ని శాఖల అధ్యాపకులు శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరలో (ఎంటెక్)పీహెచ్‌డీ ప్రవేశ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాసర, మహబూబ్ నగర్ సెంటర్లకు సంబంధించిన ప్రవేశ ఫలితాలు విడుదల జూలై 4న, జూలై 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ ఫలితాలను మొదటిగా విడుదల చేసిన విశ్వవిద్యాలయంగా బాసర ఆర్జీయూకేటీ నిలిచిందన్నారు. ఇందులో భాగమైన టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీన్లు డాక్టర్ మహేష్, డాక్టర్ విట్టల్, డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల హెచ్ఓడీలు, పీఆర్‌వో విజయ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవర్ధన్

మీ తమ్మునిపై కేసు అయ్యింది..

- ఉపాధ్యాయుడికి సైబర్ నేరస్తుడి ఫోన్..
- అప్రమత్తతతో తప్పించుకున్న బాధితుడు



ప్రకాశ్‌నాయక్

జన్నారం: హలో.. నేను సీబీఐ నుంచి మాట్లాడుతున్నా.. మీ తమ్మునిపై కేసు నమోదైంది. మీరు వెంటనే ఆదిలాబాద్ రండి.. లేకుంటే చాలా ప్రమాదంలో పడుతారని ఉపాధ్యాయుడికి ఫోన్‌రావడంతో మొదట బిత్తరపోయిన ఉపాధ్యాయుడు తేరుకుని సైబర్ నేరస్తుడని గ్రహించి తప్పించుకున్న సంఘటన జన్నారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాశ్‌నాయక్‌కు ఓ వ్యక్తి ఫోన్‌చేసి నేను సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నా.. మీ తమ్ముడు ప్రమోద్‌పై కేసు నమోదైంది. మీరు వెంటనే ఆదిలాబాద్‌కు రండి అని చెప్పాడు. మొదటగా భయాందోళనకు గురైన ఉపాధ్యాయుడు వెంటనే ఆదిలాబాద్‌లో ఉంటున్న ప్రమోద్‌కు ఫోన్ చేశాడు. ఎక్కడున్నావని అడుగగా గుడిలో పూజ చేస్తున్నట్లు చెప్పాడు. సదరు ఉపాధ్యాయుడు అదే నంబర్‌కు ఫోన్ చేసి బెదిరించడంతో సైబర్ నేరగాడు ఫోన్ కట్ చేశాడు. విషయాన్ని ఎస్సై అనూషకు చెప్పడంతో అలాంటి ఫేక్ కాల్‌లను నమ్మవద్దని సూచించారు.

సాంస్కృతికశాఖ సలహామండలి సభ్యుడిగా నాగరాజు



నాగరాజు

మందమర్రి రూరల్: మందమర్రి పట్టణానికి చెందిన ధూంధాం సాంస్కృతిక విభాగం వ్యవస్థాపకుడు అంతడ్పుల నాగరాజును తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సాంస్కృతిక మండలి సలహాదారుగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పలువురు కళాకారులు నాగరాజును అభినందించారు.

'9న సమ్మె విజయవంతం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్ కాలనీలోని జీటీ హాస్టల్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. ఈ సమ్మెతో కేంద్రానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ముస్కె సమ్మయ్య, బాజీ సైదా, కిషన్ రావు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బండి రమేష్, చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, కిషన్ రెడ్డి, కాంతయ్య, సత్యం, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ సమ్మె నోటీసు

జూలై 9న జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును హెచ్ఎంఎస్ నాయకులు శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్‌కు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, అశోక్, గొల్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.